క్లుప్తంగా

విద్యార్థి టెండూల్కర్‌కు ఎమ్మెల్యే సింహాద్రి అభినందన

అవనిగడ్డ: స్టేట్ మీట్ అండర్ 19 ఆర్చరీలో గోల్డ్ మెడల్ సాధించిన స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ విద్యార్థి అంద్రాజు టెండూల్కర్‌ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అభినందించారు. స్థానిక కళాశాల ప్రాంగణంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో టెండూల్కర్‌కి ఎమ్మెల్యే శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

3న నేత్ర వైద్యశిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి (పెదకాకాని) సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో డిసెంబరు 3వ తేదీన ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటుచేశామని సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మారుతీ కాన్వెంట్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం జరుగుతుందన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి శుక్లాలు ఉన్నవారికి శంకర కంటి ఆస్పత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారన్నారు. ఇతర వివరాలకు సెల్: 94906 36466, 90747 77544 నంబర్లను సంప్రదించవచ్చని చెప్పారు.

కరాటేలో పల్లోటి విద్యార్థులకు పతకాలు

పెడన: రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పెడన పల్లోటి ఉన్నత పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ జోజిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో ఈ నెల 26న జరిగిన ఇంటర్ స్టేట్ కరాటే, కర్రసాము పోటీల్లో పల్లోటి నుంచి 17 మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. కరాటేలో 10 స్వర్ణ పతకాలు, నాలుగు వెండి పతకాలను పల్లోటి విద్యార్థులు కైవసం చేసుకున్నారని తెలిపారు. కర్రసాములో 12 స్వర్ణ పతకాలను సాధించారని చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

అవనిగడ్డ: ఈశ్వర్ సుబ్బు అకాడమీకి చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీలకు ఎంపికయ్యారని అకాడమీ అధ్యక్షురాలు పి. విశ్వ తెలిపారు. ఈ మేరకు అకాడమీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారికి అభినందన కార్యక్రమం జరిగింది. అండర్ 14లో ఎం. లూకేష్, కేఎల్ఎస్ లాస్యశ్రీ, సీహెచ్ సాత్విక గోల్డ్‌మెడల్ సాధించారని విశ్వ చెప్పారు. అండర్ 17లో బి. మనోజ్ సిల్వర్ మెడల్ సాధించగా, డి. హర్ష వర్ధన్, కె. తేజేస్, కౌసిక్, బి. రాఘవేంద్ర రజత పతకాలు సాధించారని తెలిపారు. వీరంతా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

పెడన చేరుకున్న విజయకుమార్ పాదయాత్ర

పెడన: విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయకుమార్ పాదయాత్ర బుధవారం పెడన చేరుకుంది. పాదయాత్రకు 9వ వార్డు కౌన్సిలర్, ఎస్సీ నాయకుడు గరికిముక్కు చంద్రబాబు స్వాగతం పలికారు. మున్సిపల్ కార్యాలయం వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలో పేదరిక నిర్మూలన కోరుతూ తిరుపతి జిల్లా తడలో జూలై 23న ఆయన పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా పెడనలో విజయకుమార్ మాట్లాడుతూ పేదరికం లేని సమాజాన్ని నిర్మించాలని, అందుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పాదయాత్ర విశాఖలో ముగుస్తుందని తెలిపారు.

కమనీయం.. కార్తిక దీపోత్సవం

కోడూరు: కోడూరు అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తిక దీపోత్సవాన్ని బుధవారం కనులపండువగా నిర్వహించారు. మూలమూర్తికి విశేష అభిషేకాలు జరిగాయి. అనంతరం దీక్షాధారులకు అన్నసమారాధన నిర్వహించారు. రాత్రి స్వామి వారి ఆలయంలో నిర్వహించిన కార్తిక దీపోత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

మార్మోగిన జగన్ నినాదం

- బందరులో బస్సు యాత్ర విజయవంతం
- భారీగా తరలివచ్చిన జనం.. కిటకిటలాడిన రహదారులు
- స్వచ్ఛందంగా పాల్గొన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలు
- నగరంలో రెపరెపలాడిన వైఎస్సార్ సీపీ జెండాలు
- వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం



సామాజిక సాధికార బస్సు యాత్రలో పాల్గొన్న అశేష జనవాహినిలో ఒక భాగం

కోనేరుసెంటర్: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం బందరులో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో రోడ్లన్నీ కిటకిటలాడాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు చెందిన మహిళలు అంచనాలను మించి స్వచ్ఛందంగా తరలివచ్చారు. కార్యక్రమం ప్రారంభం నుంచి ముగింపు వరకు ఉండి నేతల ప్రసంగాలను ఆసక్తిగా ఆలకించారు. మునిసిపల్ కార్యాలయం కూడలిలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంతో నగరంలోని ప్రధాన రహదారులు కిక్కిరిశాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిందాబాద్, పేర్ని నాని జిందాబాద్, కిట్టు జిందాబాద్ అంటూ చేసిన నినాదాలతో బందరు నగరం మార్మోగింది.

బస్సుయాత్రతో సందడి

ఉదయం నుంచే నగరంతో పాటు పల్లెల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఉత్సాహంతో తిరిగారు. యువకులు తమతమ గ్రామాల నుంచి బైక్ ర్యాలీలుగా నగరానికి తరలి వచ్చారు. మహిళలు బస్సులు, ఆటోల్లో కార్యక్రమం వద్దకు చేరుకుని నేతల ప్రసంగాలను ఆసక్తిగా ఆలకించారు. కార్యక్రమాన్ని అందరూ వీక్షించేలా స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. దీంతో బస్సు వరకు వెళ్లలేని అనేక మంది స్క్రీన్‌లపై కార్యక్రమాన్ని వీక్షిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని)కి మద్దతుగా నినాదాలు చేశారు. కార్యక్రమం అనంతరం సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు, నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మార్కెట్‌యార్డు చైర్మన్ గాడెల్లి డేవిడ్ శామ్యూల్, వైస్ చైర్మన్ కంచర్లపల్లి శివాజీ, మాజీ చైర్మన్ అచ్చేబా, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సిలార్‌దాదా, డెప్యూటీ మేయర్లు శీలం భారతి, మాడపాటి విజయలక్ష్మి,



మాట్లాడుతున్న పేర్ని కిట్టు



సీఎం జగన్, ఎమ్మెల్యే పేర్ని నాని ప్లకార్డుల ప్రదర్శన

మాజీ డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, కవిత, వైఎస్సార్ సీపీ నాయకుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లంకే వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్లు వాలిశెట్టి రవిశంకర్, శీలం మారుతీరావు, చిటికిన నాగేశ్వరరావు, మేకల సుబ్బన్న, కాగిత జవహర్, శౌంతి ఫరీద్, నాయకులు జక్కుల ఆనంద్‌బాబు, థామస్ నోబుల్, బేతపూడి రవి, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

వెనుకబడిన అన్ని వర్గాలకు న్యాయం జరుగుతోంది



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వెనుకబడిన అన్నివర్గాల వారికి న్యాయం జరుగుతోంది. పదవుల కేటాయింపులో, ప్రభుత్వ పథకాల అమలులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనార్టీలకు న్యాయం జరుగుతోంది. జగనన్నలాంటి ముఖ్యమంత్రి మనకు లభించడం వెనుకబడిన వర్గాల వారు చేసుకున్న అదృష్టం.

– అలుగోజి రోహిణి, మచిలీపట్నం

సామాజిక న్యాయం జరుగుతోంది



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల వారికి సామాజిక న్యాయం జరుగుతోందనడంలో ఎటువంటి సందేహం లేదు. వయసు చిన్నదైనా అన్ని వర్గాలను సమానంగా చూస్తున్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనారిటీ వర్గాలకు జగనన్న అందిస్తున్న సహకారం ఇప్పటి వరకు మరే ముఖ్యమంత్రి అందించలేకపోయారు. జగన్ చల్లగా ఉండాలి. మళ్లీమళ్లీ జగనే ముఖ్యమంత్రిగా కొనసాగాలని భగవంతుడిని కోరుకుంటున్నా.

–పి. ఈశ్వరమ్మ, మచిలీపట్నం

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- పలుచోట్ల 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి'
- సంక్షేమ బోర్డులు, పార్టీ పతాకాల ఆవిష్కరణ

గుల్లలమోద(నాగాయలంక): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి, పల్లెకు పోదాం కార్యక్రమాలు బుధవారం పలు ప్రాంతాల్లో జరిగాయి. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ఆయా ప్రాంతాల్లో సంక్షేమ బోర్డులను, పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. నాగాయలంక మండలం గుల్లలమోద సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది వెంకటనారాయణ (చిన్నారి), వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు మాట్లాడుతూ సచివాలయం పరిధిలో ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సంక్షేమ బోర్డును, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు గ్రామంలో గృహాలకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఎదురుమొండి ఎంపీటీసీ మోకా నాగప్రసాద్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ తోట సాయిబాబు (బ్రంకుల), పూర్వ డీసీ మాజీ చైర్మన్ బీసాబత్తుని ప్రసాద్ పాల్గొన్నారు.





గుల్లలమోదలో సంక్షేమ బోర్డును ఆవిష్కరించిన నాయకులు : చినపాండ్రాకలో డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరణ

- **కృత్తివెన్ను:** చినపాండ్రాక-1 సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో సంక్షేమ బోర్డును పార్టీ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. ప్రజలకు జగనన్న ప్రభుత్వం చేస్తున్న మేలును వివరించారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జి కొక్కిలిగడ్డ బాపూజీ, వ్యవసాయ సలహా మండలి జిల్లా బోర్డు సభ్యుడు పట్టపు నాని, సర్పంచ్ కొండ్రు బాయమ్మ, సచివాలయ కన్వీనర్ పెద్ది శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.
- **ఉత్తరచిరువోలులంక(మోపిదేవి):** పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. ఉత్తరచిరువోలులంక గ్రామ సచివాలయం వద్ద పల్లెకు పోదాం, ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ నుంచి ప్రారంభించి 12 గ్రామ సచివాలయల్లో ఏపీకి వై నీడ్స్ జగన్ కార్యక్రమం పూర్తి చేశామని తెలిపారు. ఉత్తరచిరువోలులంక సర్పంచ్ చింతా శ్రీనివాసరావు, మేళ్లమర్తిలంక సర్పంచ్ కొలసాని వెంకట కృష్ణ సచివాలయ పరిధిలో ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సంక్షేమ బోర్డును, పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు ఆది రాంబాబు, రావి రాంప్రసాద్, రెడ్రౌతు వెంకట రమణ, ఉప సర్పంచ్ బొమ్మసాని లక్ష్మణరావు, ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, గ్రామ కన్వీనర్ కొల్లా శివకృష్ణ, బాబూరావు, గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.
- **గూడూరు:** ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం గూడూరు మండలం పోలవరం గ్రామ సచివాలయంలో జరిగింది. సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం అమలు చేసిన సంక్షేమ పథకాలతో జరిగిన మేలును వివరించారు. కార్యక్రమంలో సర్పంచి నక్కిన నాగరాజు, వైస్ ఎంపీపీ పిచ్చుక గంగాధరరావు, పర్ణం పెదబాబు, నాయకులు గిరిజ, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.
- **మంగళాపురం(చల్లపల్లి):** మంగళాపురంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం రాత్రి నిర్వహించారు. గ్రామ సచివాలయంలో సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని నాని ఎగురవేశారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ అమలు చేసిన మేనిఫెస్టో, టీడీపీ అమలు చేయని మేనిఫెస్టో ప్రజలకు చూపించి సీఎం జగన్ చేసిన మేలు వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పేరం నాగిరెడ్డి, ఎంపీటీసీ నూకల వెంకటేశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ యడ్ల జగదీష్, ఏఎంసీ డైరెక్టర్ అబ్దుల్ అర్షద్, పరుచూరి వెంకన్నబాబు, జుజ్జువరపు భాగ్యారావు, పైడిపాముల వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

పెడన: మడక పంచాయతీ పరిధిలో జరిగిన కార్యక్రమంలో సంక్షేమ బోర్డును, పార్టీ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. జగన్ ప్రభుత్వంలో జరిగిన మేలును ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సర్పంచ్ జోగి వెంకటలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు కొండవీటి నాగబాబు, పెనుమల్లి సర్పంచ్ గరికపాటి రామానాయుడు, సచివాలయ కన్వీనరు బెజవాడ నాగబాబు, పామర్తి సాంబశివరావు, ఆరెపు రామరాజు, భీమనబోయిన శివరాం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి
ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు




బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు ఏమైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టామని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండల పరిధిలోని రామకోటిపురంలో బుధవారం ఎమ్మెల్యే సింహాద్రి, యువనేత సింహాద్రి వికాస్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే సింహాద్రి, వికాస్ వివరించారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అధికారం ఇస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అమలులోకి వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్‌లు గొరుముచ్చు ఉమా, లక్ష్మీతిరుపతమ్మ, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

వడ్డీతో సహా బీమా మొత్తాన్ని చెల్లించండి

చిలకలపూడి(మచిలీపట్నం): ఖాతాదారునికి వడ్డీతో సహా బీమా మొత్తాన్ని చెల్లించాలని స్టార్ హెల్త్ అండ్ ఎలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీ రాయలలు బుధవారం తీర్పు చెప్పారు. మచిలీపట్నానికి చెందిన రేపాల కాంతారావు భార్య రేపాల లీలావతి పేరుతో స్టార్ హెల్త్ అండ్ ఎలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీలో రూ. 50 లక్షలకు ప్రమాద బీమా పాలసీని తీసుకున్నారు. రోడ్డు ప్రమాదంలో లీలావతి మరణించారు. దీంతో భర్త కాంతారావు ఇన్సూరెన్స్ కంపెనీకి క్లెయిమ్ చేసుకోగా వారు తిరస్కరించారు. వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించగా పూర్వాపరాలను విచారించిన అనంతరం కమిషన్ ఫిర్యాదుదారులకు రూ. 50 లక్షలు బీమా మొత్తాన్ని 9 శాతం వడ్డీతో 2022 ఏప్రిల్ 26 నుంచి చెల్లించాలని, మానసిక వేదనకు గురిచేసినందుకు రూ. 3 లక్షలు, ఖర్చుల నిమిత్తం రూ. 15 వేలు తీర్పు వెలువడిన 30 రోజుల్లోగా చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

రామలింగేశ్వరుడికి ప్రత్యేక అలంకారం



నాగాయలంక: నాగాయలంక శ్రీరామ పాద క్షేత్రంలో రామలింగేశ్వర స్వామి బుధవారం రాత్రి అలంకార శోభితుడై కార్తిక వైభవంతో అలరారాడు. మండపం ప్రాంగణంలో మహిళలు కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేశారు. పండితులు ప్రదర్శించిన నవ హారతుతను భక్తి పారవశ్యంతో తిలకించారు.

వంట సామగ్రి అందజేత

పెడన: మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి జగనన్న గోరుముద్ద వంట ఏజెన్సీలకు ప్రభుత్వం వంట సామగ్రిని అందజేసింది. వీటిని బుధవారం 9వ వార్డు కౌన్సిలర్ గరికిముక్కు చంద్రబాబు తోటమూల హైస్కూల్, ఎంపీపీ పాఠశాలలోని వంట ఏజెన్సీలకు అందజేశారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం

చల్లపల్లి: ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేశామని తహసీల్దార్ కె.గోపాలకృష్ణ తెలిపారు. మంగళాపురం పీఏసీఎస్ ఆవరణలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ బుధవారం పరిశీలించారు. ఈ కేంద్రంలో ఇప్పటి వరకు ఐదుగురు రైతుల నుంచి రూ.15,08,614 విలువ కలిగిన 684.8 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. ఆర్‌బీకేలో సిద్ధంగా ఉన్న గోనె సంచులు, స్టాక్ గోడౌన్, సమాచార బోర్డును పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా షెడ్యూల్ ప్రకారం పనిచేయాలని ఆదేశించారు. సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఇన్‌చార్జి సీఈఓ కె.కమలాకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నగరేశ్వరునికి ఏకాదశ రుద్రాభిషేక పూజలు

నాగాయలంక: స్థానిక పార్వతీ సమేత కన్యకా పరమేశ్వరీ సమన్విత నగరేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసోత్సవాల్లో భాగంగా బుధవారం నగరేశ్వరునికి 11 రుద్రాలతో మహన్యాస పూర్వక అభిషేకాలు జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు, భక్తుల సమక్షంలో గంధం, పసుపు, కుంకుమ, విభూది, సుగంధ ద్రవ్యాలతో అభిషేక పూజలు నిర్వహించారు. శివయ్యకు మారేడు దళాలతో అలంకరణ చేశారు.

గుణదల లూర్థు మాత స్వరూపం ఊరేగింపు

కోడూరు: గుణదల లూర్థు మాత శత జయంత్యుత్సవాలను పురస్కరించుకుని లూర్థుమాత స్వరూపాన్ని కోడూరు వీధుల వెంట ఊరేగించారు. లూర్థు మాత స్వరూపాన్ని బుధవారం కోడూరు ఆర్సీఎం చర్చి వద్దకు తీసుకువచ్చారు. విచారణ గురువులు ఫాదర్ ప్రశాంత్ పర్యవేక్షణలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. లూర్థు మాత స్వరూపాన్ని కోడూరు, ఇస్మాయిల్‌బేగ్ పేట, యర్రారెడ్డివారిపాలెం, కృష్ణాపురం గ్రామాల్లో ఊరేగించారు. క్రైస్తవులు శిలువలు పట్టుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. మండలంలోని వివిధ చర్చిలకు సంబంధించి పాస్టర్లు పర్యవేక్షించారు.

వనసమారాధన

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలులోని శ్రీ మద్రామ సువర్చలా సమేత ఆంజనేయస్వామి వారి ఆలయం వద్ద బుధవారం వనసమారాధన నిర్వహించారు. స్వామివార్లను దర్శించుకున్న భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు. కార్తిక మాసం సందర్భంగా రాత్రి వన భోజనాలు ఏర్పాటు చేశామని ఆలయ ప్రధాన అర్చకులు పెళ్లూరి వెంకటేశ్వరరావు తెలిపారు.

చౌడేశ్వరి ఆలయంలో చండీ హోమం

గూడూరు: మల్లవోలులో ప్రసిద్ధి చెందిన బాలచౌడేశ్వరి దేవి ఆలయం ఏడో వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామానికి చెందిన బూసం వరలక్ష్మి, మల్లిబాబు దంపతుల ఆధ్వర్యంలో చండీ యాగం నిర్వహించారు. ఈ సందర్భంగా 108 మంది ముత్తయిదువలు అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది.

అర్హులైన వారు ఓటరుగా నమోదు కావాలి

పెడన: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, అందుకు ఆన్‌లైన్‌లో లేదా సమీపంలోని పోలింగ్ కేంద్రంలో బీఎల్‌ఓలను సంప్రదించాలని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి కె. రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశం హాల్‌లో బీఎల్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఓటరు తమ ఓటు ఉందో లేదో పరిశీలించుకోవాలన్నారు. మీ కుటుంబ సభ్యులలో ఎవరైనా చనిపోయి ఉంటే వారి పేర్లను తొలగించేలా సమీపంలోని బీఎల్‌ఓలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బి. మహేంద్ర, టీపీఓ ఏసుబాబు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఓటరు దరఖాస్తులపై విచారణ పూర్తిచేయాలి

గూడూరు: ఓటరు దరఖాస్తులపై బీఎల్‌ఓలు త్వరితగతిన విచారణ పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని పెడన నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.రాజ్యలక్ష్మి ఆదేశించారు. గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు పోలింగ్ బూత్‌ల వారీగా వచ్చిన దరఖాస్తులపై తీసుకున్న చర్యలను సమీక్షించారు. సమావేశంలో తహసీల్దార్ బి.విజయప్రసాద్, వీఆర్వోలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ట్యాబ్‌ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: చిలకలపూడి పాండురంగ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఐఈఆర్‌పీ శిక్షణ కార్యక్రమంలో ట్యాబ్‌లను సమగ్ర శిక్ష ఏపీసీ కె. రాములునాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు బోధన చేసేందుకు ఎంపికైన 19 మంది వలంటీర్లకు వీటిని ఆయన అందజేశారు. కో–ఆర్డినేటర్ ఏడుకొండలు, అధికారులు రాంబాబు, సుభాన్, పాఠశాల హెచ్‌ఎం కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రూ. 12.30 లక్షలకు పాత కలప వేలం

మచిలీపట్నంటౌన్: నగరంలోని రంగనాయకస్వామి ఆలయంలో ముఖమండపం పాత టేకు కలప, పాత మద్రాసు టెర్రస్ పైకప్పు తొలగించి తీసుకువెళ్లేందుకు బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆలయ ఈఓ కె. వేణుగోపాలరావు ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. 85 మంది డిపాజిట్లు చెల్లించారు. నలుగురు డిపాజిట్‌దారులు పోటీపడ్డారు. రూ. 12.30 లక్షలకు పాటదారుడు అనిశెట్టి ధనుంజయ దక్కించుకున్నారు.

పంప్‌హౌస్ ప్రారంభం

అవనిగడ్డ: స్థానిక లాకుల వద్ద నిర్మించిన రామకోటిపురం పంప్‌హౌస్‌ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బుధవారం ప్రారంభించారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్‌లు గొరుముచ్చు ఉమా, లక్ష్మీతిరుపతమ్మ పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

పబ్లిక్ ప్రకటన

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
ఆఫీస్ చిరునామా : డి.నెం. 22జి-13-8, 2వ ఫ్లోర్, వెంకట రామ పవర్ ప్రెస్ రోడ్డు, సెంట్రల్ బ్యాంక్ ఎదురుగా, పవర్‌పేట, ఏలూరు - 534002.

డిమాండ్ నోటీసు
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13(2) క్రింద ప్రకటన

Loan A/c No.:TDFLMTF1801300010	ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది / బకాయి మొత్తం
1. ... 2. ... 3. ... 4. ... – 521001	08.10.2018 రూ. 50,00,000/-	30.05.2023 రూ. 1,62,23,567/-

SARFAESI